# సినీ బేతాళ కథలు

## – డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

**- 22 -**

## – ఫేటల్ ఎట్రాక్షన్ !–

**విక్రమార్కుడు** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని, జారిపోకుండా పట్టు వదలకుండా నడక సాగించాడు.

'విక్రా! నీకు శ్రమ కలుగకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను' అని బేతాళుడు మొదలెట్టాడు

అల్టిమేట్ హీరో అబ్బులుఖాన్ తన సొంత చిత్రం కొంత అమెరికాలో చిత్రీకరిద్దామని యూనిట్‌తో కలిసి అమెరికా బైల్దేరాడు. తను రోజుకి మూడుసార్లు గడ్డం గీసుకోకపోతే గడ్డం గడ్డిలా పెరిగిపోతుంది. అంచేత గడ్డం సామాను హేండ్ లగేజ్‌లో పెట్టుకున్నాడు. హైదరాబాదు ఎయిర్‌పోర్ట్‌లో సెక్యూరిటీవారు అతని హేండ్ లగేజ్ తనిఖీ చేసి రేజరు, చిన్న కత్తెర షార్ప్‌గా వున్నాయి, తీసుకెళ్లడానికి వీల్లేదన్నారు.

'అవి షార్ప్ వుండకపోతే వెంట్రుకలు తెగవండి' అన్నాడు.

'ఫ్లైట్‌లో తినేటప్పుడు బాకులు, చాకులు యిస్తారు వాటితో బరుక్కోండి. సెక్యూరిటీ యెక్కేముందే, యెక్కాక మాకు తెల్దు' అన్నారు సెక్యూరిటీ.

'ఇదేం సెక్యూరిటీ అయ్యా దిక్కుమాలిన సెక్యూరిటీ' అన్నాడు హీరో.

'అదంతేనండి. రూల్సన్నీ వొట్టిదవలే డిస్పైడింగండి. పాసింజర్లన్ని నరకంలో నెట్టేడవే ఆరిగోలండి. ఈ గడ్డం సామానిక్కడొగ్గేసి తవరు ముందు ఫ్లైటెక్కేసేండి. మిస్సయి మిజరబుల్లై పోతారు.' అని సెక్యూరిటీ హీరోగార్ని అమెరికా ఫ్లైట్‌కి తోలేసారు.

అమెరికాకి యెగిరి అల్టిమేట్ హీరో అబ్బులుఖాన్ మాసిన గడ్డంతో, న్యూయార్క్ జె.ఎఫ్.కె ఎయిర్ పోర్ట్‌లో లాండ్ అయ్యాడు. అతని ఫిలిం క్రూ అంతా యిమిగ్రేషన్ దాటి వచ్చేశారు. కానీ అబ్బులుఖాన్‌ని మాత్రం ఆపేశారు.

'నీ పేరేంటి?' అనడిగారు.

'అల్టిమేట్ హీరో అబ్బులుఖాన్' అన్నాడు.

'అల్టిమేట్ హీరో యింటి పేరా?'

'కాదు. అది నా బిరుదు'

'ఎవరిచ్చారు?'

'బిరుదులు ఎవరూ యివ్వరు. మేమే తగిలించేసుకుంటాం. నా బిరుదు నేనే తగిలించుకున్నాను. ఇంతకీ నన్నెందుకు ఆపారు. నేను యింటర్నేషనల్ స్టార్‌ని. ఇంతకీ యిక్కడంతా తెలుగువాళ్లున్నారేంటి. అమెరికా వాళ్లెవరూ లేరా?'

'మేం తెలుగొచ్చిన అమెరికా తెలుగోల్లం. తెల్ల అమెరికావోల్లంతా యాక్సెంట్ వీకైందని ట్రయినింగ్ కోసం తెలుగుదేశానికెల్లారు. ఈకలెట్టుకునే అమెరికావోల్లని యెప్పుడో లేపేసారు. వున్నోల్లంతా వూడి పడ్డోల్లే. ముందు నీ యవ్వారం సెప్పు. నీ యిజిట్కి పప్పసేటి?' అనడిగాడు యిమ్మిగ్రేషనాఫీసరు.

'అయ్ వాంటు షూట్' అన్నాడు అబ్బులు.

'అయిబాబో షూటే! రండ్రారండి. యీడిపేరే ఖాను. షూట్ సేసేత్తాట్ట. అర్జంటుగా యీణ్నిలాగు, సొక్కా యిప్పేసి గన్నులు, బాంబులు ఎక్కడ దాచాడో యెతకండి.' అంటూ యిమ్మిగ్రేషన్ సెక్యూరిటీ అంతా యీగల్లా ముసిరి అబ్బుల్ని జబ్బలు పట్టుకుని వేరే గదిలోకి మోసుకుపోయారు. వొళ్లంతా సోదా చేసారు. ఏవీ దొరకలేదు.

'నేను యింటర్నేషనల్ స్టార్‌ని, నాకున్న ఫాన్ ఫాలోయింగు మీకు తెలియడంలేదు. ఇది చాలా అవమానం. అని వుద్రేకంగా వూగిపోయాడు అబ్బులుఖాన్.

'ఓ సోస్ - వూరుకోవో! నీకు ఫాలోయింగ్ వుందిగాబట్టే, సూటింగ్ పబ్లిగ్గా సేద్దావనుకుంటున్నావ్. కస్సేపల్లా కూకో' అని అమెరికా యిమ్మిగ్రేషన్ ఆఫీసర్ అబ్బులు పేపర్లు చెక్‌చైడానికి వెళ్లాడు.

అబ్బులు తను అనవసరంగా ఖాన్ అని తన పేరు చివర తగిలించుకున్నాను ఈ అమెరికా పీనుగులకి ఖాన్ ఫోబియా వుందన్న సంగతి మరచిపోయాను అని మధనపడుతుండగా, అమెరికా తెలుగిమ్మిగ్రేషనుడు తిరిగొచ్చి, 'సూడు అబ్బులు బాబూ! నిన్ను అరెస్టు సైడానికి మాకు పురూపులు ఏవీ దొరకలా, అయినా సూటింగన్నావు గనక నిన్ను సూటిగా మల్లా యిండియా తోలేత్తన్నాం' అన్నాడు.

'షూట్ అంటే సినిమా తీసుకుంటాను. మనుషుల్ని చంపను కదా? ' - అడిగాడు అబ్బులు.

'ఓర్నేరి ముకమా! యీ మద్దె గుల్లతో కంటే గుండాగిపోయే సినేమాల్తోటే ఎక్కూ జనాన్ని సంపేత్తన్నారు. అంచేత అతిగా ఆర్గూసైక అరిజంటుగా మీ వూరెల్లిపో. హే వె నైస్ డే!' అని అల్టిమేట్ హీరో అబ్బులుఖాన్‌ని అమెరికాలోకి రానీయకుండా వెనక్కి తోలేశారు.

అదీ! విక్రమార్కా! జరిగింది. అబ్బుల్‌ఖాన్, తనేదో సినిమా తీసుకుంటానని చెప్పకుండా ఐ వాంటు షూట్ అని యెందుకన్నాడు. తర్వాత సినిమా కోసం అని చెప్పినా అమెరికా వారు యెందుకు వినిపించుకోలేదు? - యీ ప్రశ్నలకి నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యి చెక్కలయి యెగిరి అమెరికాలో తలో స్టేట్‌లో చెదిరి పడిపోతుంది" - అని బేతాళుడు ముగించాడు.

అందుకు విక్రమార్కుడు 'ఓ బేతాళా! ఆదిలో ఫిల్మ్ కెమెరా గన్ ఆకారంలో వుండేది. అంచేత షూట్ అనే మాట వాడుకలోకి వచ్చింది. అమెరికా యిమ్మిగ్రేషన్ వారు షూటింగ్ అనే మాట వినిపిస్తే వుపద్రవం పొంచి వుందని ఫిక్సయి పోతారు. ఒకసారి అలా ఫిక్సయిపోయాక మనసు మార్చుకోలేరు. అందుకే షూటింగ్ అంటే సినిమా షూటింగని తర్వాత చెప్పినా వారు రిస్కు తీసుకోలేకపోయారు. అంతేకాదు గన్ షూటింగ్ కంటే, యిండియన్ సినిమా షూటింగ్, యిమ్మిగ్రేషనుడు అన్నట్టు రిలీజు తర్వాత భారీ జన నష్టం కలిగిస్తుంది.

ఆయుధానా మహం వజ్రం
ధేమానా మస్మి కామధుక్
ప్రజనశ్చాస్మి కన్దర్పః
సర్పాణా మస్మి వాసుకిః ||

- ఆయుధములలో వజ్రాయుధమున్ను, ఆవులలో కామధేనువున్ను, సంతాన కారణమైన మన్మధుడను, ఒకతల గల పాములలో వాసుకియు నేనే అయిననూ ప్రేక్షక ప్రాణహరణ కారణము కిరాత చిత్రమొక్కటియే! - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు" అని విక్రమార్కుడు బదులు చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు యెగిరి మళ్లీ చెట్టెక్కేసిన సినిమా చెట్టెక్కేశాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments